క్లుప్తంగా

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం 12 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. తీగల కిష్టగౌడ్ సోదరులు వారి తల్లిదండ్రులు రాజవ్వ, కాషాగౌడ్ జ్ఞాపకార్థం ఈ ఆలయం నిర్మించారు.

ముధోల్ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: మండలంలోని మొగ్గి గ్రామానికి చెందిన మోతీరాం పటేల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మొగ్గికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, శివాజీ పటేల్, సోమ్‌నాథ్ ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

హిందువులు ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న మహేందర్

కడెం: హిందూ సమాజ హితం కోసం హిందువులంతా ఐక్యంగా ఉండి పోరాడాలని ఆర్ఎస్ఎస్ వక్త మోతే మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం కడెంలోని రామాలయంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. హిందువులు కుటుంబ జీవన విలువలు, స్వఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన సూచించారు.

యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని డబుల్‌బెడ్ రూం కాలనీలో నిరుపేద కుటుంబమైన అట్కపురం లావణ్య-లచ్చన్న దంపతుల కూతురు శ్రీవాణి వివాహానికి ఓకేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఓడ్డెపల్లి కృష్ణంరాజు శనివారం రూ.ఐదు వేల విలువైన బియ్యం బస్తాలు, సరుకులను యువతి కుటుంబీకులకు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దూడం శ్రీనివాస్, సంగర్తి రా జన్న, అడెపు రవి, రాం భీమేశ్వర్, రాజేందర్, సిలివేరి సత్యం, కిషన్, బుర్ర శేఖర్, ప్రదీప్ తదితరులున్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలి

కుంటాల: భారీ వర్షాలకు దెబ్బతిన్న మండలంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కుంటాలకు చెందిన న్యాయవాది జక్కుల గజేందర్ శనివారం భైంసాలో ఆర్ అండ్‌బీ డీఈ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రమాదాలు జరగకుండా మండలంలోని కల్లూరు-కుంటాల రోడ్డుపై మలుపు వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరగా డీఈ సానుకూలంగా స్పందించినట్లు గజేందర్ పేర్కొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

ముధోల్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ముధోల్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ నాయకులు శశిధర్ కుమార్.. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. శనివారం నిజామాబాద్ పట్టణంలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

కుంటాల: ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంఈవో ముత్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెలవురోజైన రెండో శనివారం మండలంలోని కల్లూరు, కుంటాలలో పాఠశాలలను కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. సంబంధిత పాఠశాలలకు నోటీసులు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ముళ్ల పొదలు తొలగించరూ



కుంటాల: మండలంలోని కల్లూరు నుంచి కుంటాల వెళ్లే మార్గంలో గ్రామ శివారులో మలుపు వద్ద పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు రోడ్డుపైకి పెరిగి ప్రయాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఎదురు వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రోడ్డుపైకి వచ్చిన పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చేతికందుతున్న విద్యుత్ తీగలు



కుంటాల: మండలకేంద్రంలోని 12వ వార్డులో విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. చేతికి అందే ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉండటంతో ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకర తీగలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ గండి పూడ్చరూ..

లక్ష్మణచాంద: ఇటీవలి భారీవర్షాలకు మండలంలోని రాచాపూర్ సమీపంలో మర్రికుంట చెరువు నుంచి ఊర చెరువులోకి నీళ్లు వచ్చే డీ-17 కాలువకు భారీ గండి పడింది. దీంతో కాలువలోకి మట్టి చేరింది. అధికారులు గండిని పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.



వాహనదారులూ.. జర పైలం



లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి నుంచి చింతల్‌చాందకు వెళ్లే మార్గంలో డబుల్ రోడ్డుపై రైతులు తమ పంటలను ఆరబెట్టుకునేందుకు కుప్పలుగా పోస్తున్నారు. మలుపు వద్ద దగ్గరకు వచ్చేవరకు పంట కుప్పలు కన్పించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చేనులో నీరు.. చేతితోనే సోయా కోతలు

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సోయా చేన్లలో వర్షపునీరు నిలిచింది. దీంతో పంట నూర్పిడి చేయాలంటే యంత్రాలు చేన్లలోకి రాని పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలోని ఓలా తదితర గ్రామాల్లో రైతులు సోయా పంటను కూలీలతో కోయిస్తూ.. యంత్రాల ద్వారా నూర్పిడి చేయిస్తున్నారు.



తెల్లబంగారం మెరిసేనా !

- 10 రోజుల్లో చేతికి రానున్న పత్తి పంట
- వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడులు
- మద్దతుధర పెంపునకు రైతుల వేడుకోలు



రాయపూర్‌కాండ్లీ శివారులో అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను

లోకేశ్వరం: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట మరో 10 రోజుల్లో చేతికి రానుంది. రెండేళ్లుగా తక్కువ దిగుబడులు రావడం, సరైన ధర కరువైంది. ఈసారైనా మద్దతు ధర వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 4.30 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయగా.. అందులో 1.57 లక్షల ఎకరాల్లో తెల్లబంగారంగా పిలుచుకునే పత్తి పంటను సాగు చేశారు. మరోవైపు ఈసారి అధిక వర్షాలు తమను ముంచాయని కర్షకులు వాపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పెరిగిన ఖర్చులు..

గతంలో కంటే ఈ ఏడాది పత్తి పంట సాగుకు పెట్టుబడులు పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి సాగు చేసేందుకు రూ.40వేల పైనే ఖర్చు అవుతోంది. ఈఏడాదిలో అధిక వర్షాలతో చేనులో నీరు నిలిచి మొక్కలకు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు వివిధ మందులు పిచికారీ చేసేందుకు మరిన్ని అదనపు ఖర్చులు అయినట్లు రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల పత్తి చేన్లలో మొక్క కింది భాగంలో కాయలు మురిగి పోయాయని.. దీంతో దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా.. ప్రస్తుతం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని పలువురు అన్నదాతలు పేర్కొంటున్నారు.

భారీవర్షాలే ప్రధాన కారణం

జిల్లాలో పత్తి చేన్లు దెబ్బతినడానికి ప్రధాన కారణం భారీవర్షాలే. వర్షాలతో భూమిలో తేమ శాతం ఎక్కువ ఉండడంతో మొక్క సరిగా ఎదగలేదు. అధిక వర్షాలతో పత్తి పంటలు ఎర్ర బారి పోయాయి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నిలకడగా లేని ధరలు..

రెండేళ్లుగా పత్తి ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట పత్తి పంట క్వింటాల్‌కు ధర రూ.10 వేలు పలికింది. ఆ తర్వాత రూ.7వేలు నుంచి రూ.8 వేల వరకు పలికింది. ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది ఇళ్లలో పత్తిని నిల్వ చేసుకొని నష్టపోయారు. ఈసారి పెరిగిన పెట్టుబడులకు రూ.10 వేల మద్దతు ధర ఉంటే తప్ప మేలు జరగదంటున్నారు.

ఖర్చులు పెరిగాయి



మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇటీవల భారీవర్షాలతో పంటకు తెగుళ్లు సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. గతంలో కంటే ఈసారి ఖర్చులు పెరిగాయి. ధర పెరిగితేనే గిట్టుబాటు అవుతోంది.

– తోట రవి, రాయపూర్‌కాండ్లీ

మద్దతు ధర కల్పించాలి



రెండేళ్లుగా పత్తికి మద్దతు ధరలు తగ్గుతున్నాయి. మాకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈసారి ఆశించిన దిగుబడులు వచ్చేలా లేవు. ధర పెంచితేనే పత్తి రైతులకు మేలు జరుగుతుంది.

– రాజేశ్వర్, వట్టోలి

ఓటు చోరీని అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్‌లో సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పక్కన నాయకులు

ఖానాపూర్: ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్న కేంద్ర చేస్తున్న ఓటు చోరీని అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపులో భాగంగా శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఓటు చోరీ ఆపాలని సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఓటు చోరీపై పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యవంతుల్ని చేసి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను పలు కుల సంఘాల నాయకులు, మండలాల ప్రజలు వేర్వేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈసందర్భంగా నాయకులతో పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికల గురించి చర్చించారు. అనంతరం పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించారు. పనులు పూర్తిచేసుకున్న వారికి సకాలంలో బిల్లులు వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలుచోట్ల ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. మొగల్‌పూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ ఇద్రిచ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, చిన్నం సత్యం, తోట సత్యం, అంకం రాజేందర్, స్వప్నిల్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, గుగ్లావత్ రాజేందర్, షబ్బీర్‌పాషా, జంగిలి శంకర్, జహీర్ అహ్మద్, ఆసిఫ్, కిశోర్‌నాయక్, సత్యనారాయణ, చరణ్, లక్ష్మిపతిగౌడ్, లక్ష్మిరాజం తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు..

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికే మల్లేశ్‌యాదవ్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బొజ్జును కలిశారు. శనివారం ఖానాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిసి పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామానికి విద్యుత్ సౌకర్యం, ఊర చెరువుకు సదర్మాట్ నుంచి కాలువ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందులో రవిగౌడ్, రాజేందర్, గంగసాగర్, పెద్దమల్లేశ్, రాజారెడ్డి, మురళి, చిన్నరాజన్న తదితరులు ఉన్నారు.

అడవిపందుల దాడిలో పంటలు ధ్వంసం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామశివారులోని రైతుల వరి పొలాలను శుక్రవారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. ఈ దాడిలో గ్రామంలోని బొద్దుల తిరుపతి, మేకల మల్లేశ్, పల్లెర్ల నర్సయ్య అనే రైతులకు చెందిన 40 ఎకరాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం సర్వే చేసి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.



ధ్వంసమైన వరి పంట

'కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం'


ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టించి స్థానికసంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ యత్నిస్తుందన్నారు. అధికారంలోకి ఉన్నప్పుడు బీసీ రిజర్వేషన్లను పట్టించుకోలేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై న్యాయ ప్రక్రియ సాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, నాయకులు జంగిలి శంకర్ తదితరులున్నారు.

కారును ఢీకొన్న బైక్.. ఒకరికి తీవ్ర గాయాలు

సోన్: మండలంలోని మాదాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి కారును ఓ బైక్ ఢీకొనగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం న్యూపోచంపాడు గ్రామానికి చెందిన కాంబ్లే సూర్యకాంత్ తన బైక్‌పై పోచంపాడు నుంచి నిర్మల్ వైపు వస్తున్నాడు. నిర్మల్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారును మాదాపూర్ ఎక్స్ రోడ్ వద్ద బైక్‌తో సూర్యకాంత్ ఢీకొట్టాడు. ఈఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, పోలీసులు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. సూర్యకాంత్ అన్న చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం ఎస్సై కె.గోపి తెలిపారు.

బాలలతో పనులు చేయించొద్దు

భైంసారూరల్: బాలకార్మికులతో పనులు చేయించడం నేరమని విజన్ సంస్థ కోఆర్డినేటర్ అనురాధ అన్నారు. శనివారం మండలంలోని దేగాం, ఇలేగాం గ్రామాల్లో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, లైంగికదాడులపై అవగాహన కల్పించారు. బాలల హక్కులను కాపాడడం అందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. గ్రామస్తులు ఉన్నారు.



దేగాంలో మాట్లాడుతున్న అనురాధ

పోషకాహారంపై అవగాహన



శాంతినగర్‌లో మాట్లాడుతున్న సిబ్బంది

ఖానాపూర్: పోషణమాసంలో భాగంగా పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని ఒడ్డెవాడ అంగన్‌వాడీ కేంద్రం, తిమ్మాపూర్-1, గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి పదార్థాలు ఉండాలో సిబ్బంది వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎన్ఎం పద్మ, టీచర్లు గీతారాణి, మౌనిక, మానస, వెంకటమ్మ, ఆయాలు అనసూయ, నర్సమ్మ తదితరులున్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్



పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో కలిసి మొక్క నాటుతున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

భైంసారూరల్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా వ్యవహరిస్తూ.. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. శనివారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలతో సమావేశమై కేసులపై సమీక్షించారు. నమోదవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట సీఐ నైలు, భైంసారూరల్, కుబీర్, కుంటాల ఎస్సైలు శంకర్, కృష్ణారెడ్డి, అశోక్, పోలీసులు ఉన్నారు.

బస్టాండ్‌లో ఏటీఎం చోరీకి యత్నం



ధ్వంసమైన ఏటీఎం

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఏటీఎం చోరీకి యత్నించినట్లు పట్టణ సీఐ జి. గోపినాథ్ తెలిపారు. శనివారం ఉదయం ఏటీఎం ధ్వంసమై ఉండడంతో గమనించిన పలువురు డీఎం హరిప్రసాద్‌కు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి పరిశీలించిన అనంతరం పోలీసులకు తెలుపగా వారు చేరుకుని పరిశీలించారు. తెరుచుకోకపోవడంతో దుండగులు ఏటీఎం పగులగొట్టేందుకు తెచ్చిన పరికరాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆర్టీసీ కంట్రోలర్ శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ముగిసిన హరినామ సప్తాహం



కీర్తనలు ఆలపిస్తున్న సభ్యులు

బాసర: బాసరలోని మహారాష్ట్ర పర్దేకర్ భవనంలో వారం రోజుల పాటు నిర్వహించిన అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. బ్రహ్మముహూర్తంలో స్వామివారికి కాగడహారతి, పూజలు చేశారు. పర్బని జిల్లాకు చెందిన యోగేశ్ మహరాజ్ తన బృందంతో కలిసి భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. సప్తాహం ఏర్పాటుతో ఆధ్యాత్మిక భావనలు ఏర్పడి క్రమశిక్షణ, జీవన విధానంలో మంచి మార్పు వస్తుందని పేర్కొన్నారు.

యువకుల శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను గ్రామ యువకులు శ్రమదానం చేసి తొలగించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో యువకులు ముందుకొచ్చి రోడ్డుకు ఇరువైపుల చెట్ల కొమ్మలను తొలగించారు. చేగంటి మల్లేశ్, వేముల లక్ష్మణ్, వడ్ల శ్రీధర్, పులివేని సత్యం, చిలివేరి మల్లేశ్, ఆడెపు సురేశ్, గొంగ రాకేశ్, మహేందర్, ఎనగందుల రితీశ్ తదితరులు ఉన్నారు.

గజానికో గుంత.. ప్రయాణానికి చింత





ప్రమాదకరంగా వెళ్తున్న ఆటో

నిర్మల్‌రూరల్ మండలంలోని కొండాపూర్ నుంచి అక్కపూర్ వరకు వెళ్లే బీటీ రోడ్డుపై రెండు కిలోమీటర్ల మేర గజానికో గుంత ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఈ గుంతల్లో నీరు నిలుస్తుండగా.. వాటిని తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే అక్కాపూర్, ముతాపూర్, న్యూవెల్మల్, వెల్మల్ బొప్పారం, రాచాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్